సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 25 | జూన్ | 2024



ఇక.. గుర్తింపు సులువు

టీజీ ఎన్పీడీసీఎల్.. అధునాతన సాంకేతికత వినియోగంపై దృష్టి సారించింది. రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకురానుంది. - 8లో



కార్మిక ఖజానా ఖాళీ?

పని దొరికితేనే కుటుంబం గడిచేది.. లేదంటే పస్తులే.. ఇలా దినదిన గండంగా బతుకు లీడుస్తున్న అడ్డా కూలీలకు సర్కార్ నుంచి భరోసా కరువైంది. - 8లో

గరిష్టం/కనిష్టం
$36.2^0/24.6^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి



కురవి: వర్షాకాలంలో విద్యుత్ సరఫరా, సమస్యలపై ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈఈ విజయ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో రైతుల కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం, విద్యుత్‌లైన్‌లు వేలాడకుండా సరిచేయాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ రమేష్‌బాబు, ఏఈలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ ఎన్నిక



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ మానుకోట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాళ్ల మురళీధర్‌రెడ్డి, కార్యదర్శిగా చాడ అశోక్ రెడ్డి, కోశాధికారిగా సిద్ధును ఎన్నుకున్నారు. కాగా ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఫస్ట్ వైస్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-320ఎఫ్ రీజియన్ ఫోర్త్‌జోన్-1 పీడీజీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మానుకోట లయన్స్ క్లబ్ 39 సంవత్సరాలుగా అంకిత భావంతో సమాజసేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ పీడీజీ ముచ్చ రాజిరెడ్డి, రీజియన్ అడ్వైజర్ లక్ష్మీనర్సింహరావు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, నాగవాణి, రావుల రవిచందర్‌రెడ్డి, కేశవ్‌రావు, వెంకట్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, జగన్మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కాశీనాథ్, ప్రమోద్ రెడ్డి, నెహ్రూ, భీంసాగర్, కెఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నెహ్రూసెంటర్: ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అర్హత లేకుండా ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు నిర్వహించొద్దని, రోగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని తెలిపారు. రోగులను వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. జిల్లాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉందని, అబార్షన్లను ప్రోత్సహించొద్దని, అబార్షన్లు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రాచారి, కార్యదర్శి కళాధర్‌రాజు, నజీర్‌అహ్మద్, ఎస్‌డీ సర్వర్, భీముడు పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి

బయ్యారం: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పంటల సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా నిధులను విడుదల చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ననప పొమ్మయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కంబాలపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రైతు రుణాలు మాఫీ కాకపోవటంతో పాటు రైతుభరోసా నిధులు రాక రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. రైతు భరోసా నిధులను త్వరగా విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వెంకన్న, భాస్కర్, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరం 3వ తరగతి, 5వ తరగతి, 8వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన చెంచులు, కొండరెడ్లు, పి.వి.టి.జి తెగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎర్రయ్య సోమవారం తెలిపారు. ఆయా తరగతుల్లో మొత్తం 17సీట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో ఫాంలు అందిస్తారని, ఈ నెల 30 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు.

సీజనల్ ముప్పు..

వానాకాలం కావడంతో మొదలైన విష జ్వరాలు

- పారిశుద్ధ్యంపై పట్టింపు కరువు
- భయంభయంగా ఏజెన్సీ పల్లెలు
- డెంగీ, మలేరియా బారిన పడుతున్న ప్రజలు



మమబూబాబాద్ పట్టణంలోని నందమూరినగర్ కాలనీలో అపరిశుభ్రం

సాక్షి, మహబూబాబాద్: వర్షాకాలం వచ్చిందంటే జిల్లాలో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర జ్వరాలతో ఏజెన్సీ గూడేలు, గిరిజన తండాల్లో జనం ఇబ్బందులు పడుతారు. ప్రతీ ఏటా మాదిరిగానే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు.. వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైద్యారోగ్యం, పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయం చేసుకోవాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడడం లేదు. దీంతో ఏటా ఏదో మూలన తాగునీటి కలుషితం, అపరిశుభ్ర వాతావరణంతో ఇబ్బందులు, వైద్య సేవలు అందక ఇక్కట్లు తప్పడం లేదు. అయితే ఈ ఏడాదిలో ఇప్పటికే డెంగీ, మలేరియా కేసులు నమోదయ్యాయి. కాగా ఉన్నతాధికారులు ముందస్తు ముప్పును పసిగట్టి నివారణకు మార్గం చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో జిల్లాలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురికి కాల్వలు, జనసంచార ప్రదేశాల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. జిల్లాలో 461 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 260కి పైగా పంచాయతీలు తండాలు, గిరిజన ఆవాస ప్రాంతాలు ఉండడం గమనార్హం. కాగా గ్రామ పంచాయతీ పాలక మండలి పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లోని పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులపై ఒకవైపు మిషన్ భగీరథ సర్వే, మరోవైపు గ్రామ పంచాయతీ విధుల నిర్వహణ భారం పెరిగింది. పలుచోట్ల పారిశుద్ధ్య పనులకోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు, చెత్త డబ్బాలు మూలన పడ్డాయి. అదేవిధంగా చిన్న చిన్న పంచాయతీల్లో పన్నుల వసూళ్లు కాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని కార్మికులు సక్రమంగా పనికి రావడం లేదని పలువురు క్యాదర్శులు చెబుతున్నారు. ఇన్ని కారణాలతో జిల్లాలో పారిశుద్ధ్యం పడకేసింది.

మలేరియా, డెంగీ కేసులు..

అపరిశుభ్ర వాతావరణం, తాగునీటి కలుషితంతో జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు నమోదు అయ్యాయి. 2020 నుంచి 2023 వరకు జిల్లాలో 78 మలేరియా, 215 డెంగీ కేసులు నమోదు అయినట్లు వైద్యారోగ్యశాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే 5 మలేరియా, 13 డెంగీ కేసులు నమోదు కావడం గమనార్హం. వర్షాకాలం ప్రారంభ సమయంలోనే మలేరియా, డెంగీ కేసులు నమోదు అవుతుంటే.. పూర్తిగా వర్షాలు పడితే పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

2020 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో మలేరియా, డెంగీ కేసుల వివరాలు

సంవత్సరం	మలేరియా	డెంగీ
2020	22	07
2021	30	43
2022	20	125
2023	06	40
2024 (ఇప్పటి వరకు)	05	13

కొరవడిన సమన్వయం..

వానాకాలం ఆరంభంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పంచాయతీ, వైద్యారోగ్యం, తాగునీటి సరఫరా శాఖలు సమన్వయంతో పని చేయాలి. కానీ గ్రామాల్లో ఈ మూడుశాఖల ఉద్యోగులు కలిసి ప్రణాళిక రూపొందించినవి తక్కువే. దీంతో ఇప్పటికే పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



భవానీనగర్‌లో పందుల సంచారం

పడకేశాయి. దీంతో ప్రధాన వీధులు మురికి కూపాలుగా మారాయి.అదేవిధంగా ప్రతీ శుక్రవారం ఫ్రైడే.. డ్రై డేగా పాటించాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులు చెప్పినా.. ఆచరణకు నోచుకోవడం లేదు. గ్రామాలకు ఉన్నతాధికారులో, ప్రజాప్రతినిధులో వస్తే తప్ప కాల్వలు తీయడం, బ్లీచింగ్ చల్లడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇక రోడ్లపై గుంతలు పడటం, తాగునీటి పైపులు లీకేజీలు కావడంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

> సీజనల్ వ్యాధుల ప్రబలకుండా.. ప్రత్యేక కార్యాకచరణతో ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే రెవెన్యూ,ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకున్నాం.మున్సిపాలిటీలు, గ్రామాల్లో సర్వేలు నిర్వహించి జ్వర పీడితులకు మందులు పంపిణీ చేస్తున్నాం.ప్రతీ శుక్రవారం ఫ్రైడే..డ్రై డే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం.హాస్టళ్లు,గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచడం,డాక్టర్ల పర్యవేక్షణ పెంచాం.
>
> – కళావతి బాయి, డీఎంహెచ్‌ఓ

28న వరంగల్‌కు సీఎం రేవంత్



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 28న వరంగల్ నగరానికి రానున్నారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు సోమవారం సాయంత్రం సమాచారం అందినట్లు తెలిసింది. 28న ఉదయమే హనుమకొండకు చేరుకోనున్న ముఖ్యమంత్రి కలెక్టరేట్‌లో పలు అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. గ్రేటర్ వరంగల్‌కు సంబంధించి మాస్టర్ ప్లాన్ – 2041, అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, ఎంజీఎం ఆస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, ఔటర్‌రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ పనులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష జరిపే అవకాశం ఉంది. ఆ తర్వాత హనుమకొండ హంటర్ రోడ్డులోని నిర్మాణం పూర్తయిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభంతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సమయానుకూలతను బట్టి నయీంనగర్ వంతెన నిర్మాణం పనులను కూడా పరిశీలించే అవకాశం ఉంది. సీఎం పర్యటన నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

ప్రభుత్వం మారినా అధికారుల్లో మార్పులేదు

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- మానుకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: ప్రభుత్వం మారినా అధికారుల పని తీరు మారలేదని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కాగా ఎజెండా కంటే ముందు మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి కేటాయించిన రూ.50కోట్ల నిధుల విడుదల కోసం కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఏసీబీ సెంటర్‌కు నిధులు కేటాయించాలని, మున్సిపాలిటీ పరిధిలోని పత్తిపాక రోడ్డు పనులు పూర్తి చేసేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలన్నారు.

కౌన్సిలర్లు ఏం మాట్లాడారంటే..

- సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ..గత ప్రభుత్వం మానుకోట మున్సిపాలిటీకి కేటాయించిన నిధుల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.మున్సిపాలిటీ భవనం త్వరగా పూర్తిచేయాలని,ఇళ్ల నిర్మాణం పూర్తయిన వాటికి నంబర్లు ఇవ్వాలన్నారు.
- సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. జనరల్ ఫండ్, 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఇతర పనులకు మళ్లించడం సబబు కాదన్నారు. నిజాం చెరువు మధ్యలో ఉన్న రోడ్డును తొలగించడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు.
- కౌన్సిలర్ ఎడ్ల వేణు మాదవ్ మాట్లాడుతూ.. గ్రీన్ ల్యాండ్ల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. జీఓ 58 కింద దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు ఇచ్చి ఇంటి నంబర్లు ఇవ్వాలన్నారు. ఇంటి నంబర్లు ఇవ్వకపోవడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. మానుకోట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు పాటుపడాలన్నారు.
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. అధికారులు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మోడల్ మార్కెట్ తో పాటు పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి కేటాయించిన రూ.50కోట్ల విషయంలో ఎలాంటి స్పష్టత లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, మేనేజర్ శ్రీధర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- ప్రజావాణిలో 173 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ డేవిడ్ దరఖాస్తుదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేవిధంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పెండింగ్ వినతులను కూడా త్వరగా పరిష్కరించాలన్నారు. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తు పెట్టుకుని పని చేయాలన్నారు. పరిష్కారం కాకపోతే కారణాలతో కూడిన నివేదిక అందజేయాలన్నారు. ప్రజావాణిలో 173 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద, జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, నాయకులు

మహబూబాబాద్: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.26,000 వేతనం, హెల్పర్స్‌కు రూ.21,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలన్నారు. టీచర్లకు ట్యాబ్‌లు అందించి అదనపు యాప్‌ల నిర్వహణ బాధ్యతలను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దె బిల్లులు, గ్యాస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రావణ్, పద్మ, శారద, జయమ్మ, స్వప్న, గీతారాణి, రాజమ్మ, రమాదేవి, వెంకన్న, శంకర్, పెరుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటించాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఉద్యోగులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీరోజు ఉదయం 10:30 గంటల వరకు కార్యాలయానికి చేరుకోవాలని, కార్యాలయంలో లేట్ రిజిస్టర్ అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయానికి వచ్చిన వారితో మార్యాదపూర్వకంగా నడుచుకోవాలని, ప్రజలకు నిరంతరం సేవలందించాలన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, ఏసీజీఈ శ్రీరాములు, జీఈసీఓ విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ అలీ, ఏఎస్‌ఓ సంతోష్, సూపరింటెండెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'జూడా'ల సమ్మెబాట

ఎంజీఎంలో వైద్య విద్యార్థుల ఆందోళన

- ఓపీ సేవల బహిష్కరణ
- ప్రభుత్వం దిగిరాకపోతే ఎమర్జెన్సీ సేవలు నిలిపేస్తామని స్పష్టీకరణ



ఎంజీఎంలో నినదిస్తున్న జూనియర్ డాక్టర్లు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జూనియర్ డాక్టర్లు

ఎంజీఎం: సమస్యలు పరిష్కరించాలని ఆర్నెళ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా..ఎలాంటి స్పందన లేకపోవడంతో జూనియర్ వైద్యులు నిరవధిక సమ్మెబాట పట్టారు. కొద్ది రోజులుగా నల్లబ్యాడ్జీలు, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేసిన వైద్యులు ముందుగా ప్రకటించినట్లుగానే సోమవారం నుంచి ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విధులు బహిష్కరించి ప్రాంగణంలో ఆందోళన బాట పట్టారు. ఉదయం 9 గంటలకు ఎంజీఎంలోని గాంధీ విగ్రహ ప్రాంగణానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా జూనియర్ డాక్టర్ల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతీ నెల స్టైఫండ్ కోసం అధికారులకు విన్నవించినా.. నిధులు విడుదల కావట్లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మెడికల్ కళాశాలు ప్రారంభించామని పేర్కొంటున్న ప్రభుత్వాలు ఆస్థాయిలో కళాశాలల్లో సౌకర్యాలు ఉన్నాయా.. లేవా? అనే విషయాన్ని విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుందని వెంటనే భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉస్మానియాకు నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తుండడం.. వారి సంఖ్యకు తగ్గట్లుగా సౌకర్యాలు లేకపోవడంతో ఇన్‌ఫెక్షన్ రేటు కూడా ఆస్పత్రిలో పెరిగిపోతోందన్నారు. కేఎంసీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హాస్టళ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని, కేఎంసీలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.

స్టైఫండ్ విడుదల చేయాలి..



> వైద్యవిద్యార్థులకు గ్రీన్ ఛానల్ ద్వారా స్టైఫండ్ విడుదల చేయాలి. సాధారణంగా ప్రిన్సిపాల్, డీఎంఈ, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్, టోకెన్ కేటాయింపుల తర్వాత స్టైఫండ్ విడుదల చేస్తారు. ఇలా కాకుండా గ్రీన్‌ఛానల్ పద్ధతి ద్వారా అంటే ప్రతీ నెల నిర్ణీత తేదీన వచ్చేలా నిర్ణయం తీసుకోవాలి.
>
> – డాక్టర్ శ్రీనాథ్, జూడా రాష్ట్ర ప్రతినిధి

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?



> కేఎంసీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల ఎంతో మంది విద్యార్థులు గాయలపాలవుతున్నారు.ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మూడు నెలల క్రితం నిధులు మంజూరైనట్లు వెల్లడించిన అధికారులు ఇంత వరకు టెండర్ పిలిచిన దాఖలాలు లేవు.. పనులు మొదలుపెట్టింది లేదు.
>
> – అజయ్, కేఎంసీ జూడా చైర్మన్

హాస్టళ్లు మెరుగుపర్చాలి..



> కేఎంసీలో పెరిగిన సీట్లకు అనుగుణంగా కళాశాల ప్రాంగణంలో హాస్టళ్ల సంఖ్యను కూడా పెంచాలి. నూతన మెడికల్ కళాశాల మంజూరు చేసిన ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పూర్తి స్థాయిలో బోధనా సిబ్బంది, హాస్టల్స్ సౌకర్యం కల్పించి మెరుగైన వైద్య విద్యార్థులుగా తీర్చిదిద్దాలి.
>
> – గీతాంజలి, పీజీ విద్యార్థిని

డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

గార్ల: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లోకేష్ డిమాండ్ చేశారు. సోమవారం గార్ల సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు సంచరిస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీని మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటర్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

మహబూబాబాద్ అర్బన్: ఇంటర్ సప్లమెటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మే 24 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. కాగా జిల్లా ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. ఎప్పటి మాదిరిగానే బాలికలు పైచేయి సాధించారు. కాగా మొదటి సంవత్సరం జనరల్ గ్రూపులో 2,047 మంది పరీక్షలు రాయగా 1,301 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ గ్రూపులో 531 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 300 ఉత్తీర్ణులయ్యాయి. మొత్తంగా 62.10 మంది విద్యార్థులు పాసయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ గ్రూపులో 1,184 మంది పరీక్షలు రాయగా 601 మంది పాసయ్యారు. ఒకేషనల్ గ్రూపులో 419 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 237 మంది ఉత్తీర్ణత సాధించారు. 52.27శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మెరుగైన ఫలితాలు సాధించామని డీఐఈఓ సత్యనారాయణ తెలిపారు.

రైల్వే ఉద్యోగులకు

శుభవార్త..

కాజీపేట రూరల్‌: ఏపీఏఆర్‌ హెచ్‌ఆర్‌ఎంఎస్‌లో గుడ్‌ లేదా తక్కువ గ్రేడ్‌ పొందిన రైల్వే ఉద్యోగులకు సంబంధించి తిరిగి రివ్యూ అవకాశం ఇస్తూ రైల్వే బోర్డు ఉత్వర్వులు జారీ చేసిందని రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ సికింద్రాబాద్‌ డివిజన్‌ సెక్రటరీ పి.రవీందర్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 నాటికి లోయర్‌ గ్రేడ్‌ మూలంగా ఎంఏసీపీఎస్‌ పొందే అవకాశం కోల్పోయిన ఉద్యోగులకు ఇప్పుడు జూలై 15, 2024 లోపు హెచ్‌ఆర్‌ఎంఎస్‌లో ఏపీఏఆర్‌ సమీక్ష (రివ్యూ) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మాడిఫైడ్‌ అష్యూర్‌ కెరీర్‌ ప్రొగ్రెషన్‌ స్కిల్‌ (ఎంఏసీపీఎస్‌.. పదోన్నతులు రాని రైల్వే ఉద్యోగులకు ప్రతి 10 ఏళ్లకు ఒకసారి పదోన్నతి కల్పించే స్కీం) స్కీం కింద రైల్వే కార్మికులకు లేదా ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తారు. దీనికి గాను రైల్వే కార్మికులు, ఉద్యోగులు సర్వీస్‌ రికార్డులో మూడు ఏళ్ల వరుసగా వెరి గుడ్‌ ఫర్ఫామెన్స్‌ కలిగి ఉండాలి. గుడ్‌ ఫర్ఫామెన్స్‌ లేని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారి ఒప్పుకుంటే వెరి గుడ్‌గా మర్చే అవకాశం ఉంది. ఈ స్కీంతో పదోన్నతి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

దొంగ అరెస్ట్‌, రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న టౌన్‌ సీఐ దేవేందర్‌

మహబూబాబాద్‌ రూరల్‌ : మహబూబాబాద్‌ పట్టణంలోని శ్రీఅయ్యప్ప గోల్డ్‌ షాపులో చోరీకి పాల్పడిన ఓ యువకుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్‌ సీఐ పెండ్యాల దేవేందర్‌ తెలిపారు. ఈ మేరకు సోమవారం టౌన్‌ పోలీసు స్టేషన్‌లో దొంగ అరెస్ట్‌ వివరాలు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీ రాత్రి పట్టణంలోని రున్వాల్‌ బన్సీలాల్‌కు చెందిన శ్రీఅయ్యప్ప గోల్డ్‌ షాపులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దీంతో బాధితుడు రున్వాల్‌ బన్సీలాల్‌ ఆదివారం రాత్రి టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌ ఆవరణలో టౌన్‌ పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని విచారించి పాత నేరస్తుడు చత్రి విజయ్‌ కుమార్‌గా గుర్తించారు. అనంతరం చోరీ ఘటనపై మరోసారి విచారించగా శ్రీఅయ్యప్ప గోల్డ్‌ షాపులో చోరీ చేసింది తానేనని, ఆ వస్తువులను వరంగల్‌లో విక్రయించడానికి తీసుకెళ్తున్నానని ఒప్పుకున్నాడు. దీంతో విజయ్‌ కుమార్‌ను కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, ఫిర్యాదు చేసిన 24 గంటలలోపే దొంగను పట్టుకున్న టౌన్‌ సీఐ దేవేందర్‌, ఎస్సై బి.విజయ్‌ కుమార్‌, సిబ్బందిని ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌, డీఎస్పీ తిరుపతిరావు అభినందించారు.

భర్త వేధింపులతోనే శ్రావణి ఆత్మహత్య

- నరేశ్‌పై కేసు నమోదు.. రిమాండ్‌ తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్సై సాంబమూర్తి

గణపురం: గణపురం మండలం కర్కపల్లి పంచాయతీ కార్యదర్శి పల్లెబోయిన శ్రావణి ఏప్రిల్‌ 21వ తేదీన గాంధీనగర్‌లోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై శ్రావణి తండ్రి సాంబయ్య తన కూతురు ఆత్మహత్యకు అల్లుడు నరేశ్‌ కారణమని, అతడి వేధింపులతోనే చనిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు రెండు నెలల తరువాత శ్రావణి.. తన భర్త నరేశ్‌ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడిందని తమ విచారణలో తేలిందని వివరించారు. సోమవారం నరేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌.. అధునాతన సాంకేతికత వినియోగంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రియల్‌ టైం మానిటరింగ్‌ అండ్‌ కంట్రోలింగ్‌ టెక్నాలజీని తీసుకురానుంది. దీని వల్ల సబ్‌స్టేషన్‌లో లోడ్‌, పవర్‌ ఫాక్టర్‌, ట్రిప్పింగ్‌లు, బ్రేక్‌ డౌన్‌లు, లైన్‌ క్లియర్‌ (ఎల్‌సీ)లకు సంబంధించిన పూర్తి సమాచారం ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంతోపాటు, సర్కిల్‌, సబ్‌స్టేషన్లలో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉద్యోగులు ఇచ్చే సమాచారంతో తెలుసుకుంటున్నారు. ఇక నుంచి ఎక్కడ అంతరాయం ఏర్పడింది.. సబ్‌ స్టేషన్‌లో లోడ్‌ ఏ మేరకు ఉంది.. ట్రిప్పింగ్‌లు, ఎక్కడ బ్రేక్‌ డౌన్‌ అయింది.. వంటి సమస్యలు ఆయా కార్యాలయాల్లో అధికారుల ముంగిట కనిపిస్తుంది. దీంతో వెంటనే ఉద్యోగులను అప్రమత్తం చేసి నివారణ చర్యలు చేపట్టొచ్చు.



ఒడిశాలో రియల్‌ టైం మానిటరింగ్‌ అండ్‌ కంట్రోలింగ్‌ టెక్నాలజీతో పని చేస్తున్న విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌

ఇక.. గుర్తింపు సులువు

టీజీ ఎన్పీడీసీఎల్‌ పరిధిలో నూతన టెక్నాలజీ వినియోగం

- ముందుగా విద్యుత్‌ అంతరాయం తెలుసుకోవడంపై దృష్టి
- పైలట్‌ ప్రాజెక్ట్‌ కింద రెండు సబ్‌ స్టేషన్లలో అమలు
- ఆ తర్వాత మానవ ప్రమేయం లేకుండా సబ్‌ స్టేషన్ల నిర్వహణ
- ఒడిశా వెళ్లి అధ్యయనం చేసివచ్చిన అధికారుల బృందం

హన్మకొండ: శాస్త్ర, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్‌ రంగంలోనూ చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అధునాతన సాంకేతికను వినియోగించుకునేందుకు విద్యుత్‌ పంపిణీ సంస్థలు ఉత్సాహం చూపుతున్నాయి. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్‌ సరఫరా చేసేందుకు నూతన సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకుంటూ ముందుకెళ్తున్నాయి. ఈ క్రమంలోనే మానవ ప్రమేయం లేకుండానే విద్యుత్‌ సబ్‌స్టేషన్ల నిర్వహణపై తెలంగాణ ఉత్తర విద్యుత్‌ పంపిణీ మండలి (టీజీ ఎన్పీడీసీఎల్‌) దృష్టి సారించింది. ప్రస్తుతం ఆపరేటర్లు సబ్‌ స్టేషన్ల నిర్వహణ చూసుకుంటున్నారు. నూతన టెక్నాలజీతో ఆపరేటర్ల అవసరం లేకుండానే 33/11 విద్యుత్‌ సబ్‌స్టేషన్ల నిర్వహణ జరుగనుంది. ఇందులో భాగంగా ముందుగా టీజీ ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని అన్ని 33/11 కేవీ సబ్‌–స్టేషన్లు, 33/11కేవీ ఫీడర్లను రియల్‌ టైం మానిటరింగ్‌ అండ్‌ కంట్రోలింగ్‌ టెక్నాలజీలోకి తీసుకురావడానికి సన్నాహాలు మొదలు పెట్టింది. ఈ కొత్త టెక్నాలజీతో సబ్‌స్టేషన్‌లో లోడ్‌, పవర్‌ ఫాక్టర్‌, ట్రిప్పింగ్‌లు, బ్రేక్‌ డౌన్‌లు, లైన్‌ క్లియర్‌ (ఎల్‌సీ)లకు సంబంధించిన పూర్తి సమాచారం ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంతోపాటు, సర్కిల్‌, సబ్‌స్టేషన్లలో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉద్యోగులు ఇచ్చే సమాచారంతో తెలుసుకుంటున్నారు. ఇక నుంచి కార్యాలయాల్లోనే ఎక్కడ అంతరాయం ఏర్పడింది.. సబ్‌ స్టేషన్‌లో లోడ్‌ ఏ మేరకు ఉంది... జరిగిన ట్రిప్పింగ్‌లు, ఎక్కడ బ్రేక్‌ డౌన్‌ అయింది.. వంటి సమస్యలు కార్యాలయాల్లో అధికారుల ముంగిట కనిపిస్తుంది. దీంతో వెంటనే ఉద్యోగులను అప్రమత్తం చేసి నివారణ చర్యలు చేపట్టొచ్చు. దీంతో పాటు అంతరాయం కలిగిన స్వల్పకాలంలోనే విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించే అవకాశముంది.



టెక్నాలజీ పనితీరు తెలుసుకుంటున్న ఎన్పీడీసీఎల్‌ టెక్నికల్‌ టీమ్‌

టెక్నాలజీ అమలుకు పైలట్‌ ప్రాజెక్ట్‌

ఈ కొత్త రియల్‌ టైం మానిటరింగ్‌ అండ్‌ కంట్రోలింగ్‌ టెక్నాలజీని పైలట్‌ ప్రాజెక్ట్‌ క్రింద 'స్కాప్‌', 'స్కినీదర్‌' అనే కంపెనీల ద్వారా అమలు చేయనున్నారు. జనగామ సర్కిల్‌ పరిధిలోని చిల్పూరు మండలం చిన్న పెండ్యాల, రఘునాథపల్లి మండలం నిడిగొండ సబ్‌ స్టేషన్‌లలో ఈ కంపెనీలు అవసరమైన రియల్‌ టైం మానిటరింగ్‌ అండ్‌ కంట్రోలింగ్‌ టెక్నాలజీని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ పనులు జూలై 5 వరకు పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం ఆదేశించింది. తర్వాత వీటి పని తీరును అధ్యయనం చేసి సత్ఫలితాలను బట్టి ఎన్పీడీసీఎల్‌లోని మిగతా సబ్‌స్టేషన్‌లో ఈ టెక్నాలజీ అమలుకు టెండర్లు పిలవాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది. తద్వారా మానవరహిత సబ్‌స్టేషన్‌లుగా మార్చే ఆలోచనలో టీజీ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం సమాయత్తమవుతోంది.

కొత్త విధానం అధ్యయానికి టెక్నికల్‌ టీమ్‌..

ఈ కొత్త విధానాన్ని అధ్యయనం చేయడానికి టెక్నికల్‌ టీమ్‌ను నియమించారు. ఇన్‌చార్జి డైరెక్టర్‌ వి.మోహన్‌ రావు, జీఎం (ఐటీ) జి.శ్రీనివాస్‌, ఆపరేషన్‌ జీఎం కె.గౌతంరెడ్డి, డీఈ (ఐటీ) కె.అనిల్‌ కుమార్‌, స్కాడా ఏడీ శ్రీకాంత్‌తో కూడిన ఈ టెక్నికల్‌ అధికారుల (ఇంజనీర్లు) బృందం ఈ నెల 11, 12 తేదీల్లో ఒడిశాలో టాటా పవర్‌ వెస్ట్రన్‌ ఒడిశా డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీ లిమిటెడ్‌లో అమలు చేస్తున్న తీరు, విధి విధానాలను అధ్యయనం చేసి వచ్చారు.

అధ్యయనంలో పరిశీలించిన విషయాలు..

త్వరితగతిన స్పందించి సమస్యలు పరిష్కరించడం ద్వారా అంతరాయాల సమయం తగ్గించొచ్చు. తద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సరఫరా అందించగలగొచ్చు. అంతరాయ సమయం కనిష్టంగా ఉంటుంది. మెరుగైన సరఫరా–పర్యవేక్షణ ఉంటుంది. మెరుగైన సరఫరా, పర్యవేక్షణ ఫలితంగా పరికరాల జీవితకాలం పెరుగుతుంది. వీటితో పాటు సబ్‌ స్టేషన్‌ ఆటోమేషన్‌ టెక్నాలజీపై గ్రామీణ డిజిటల్‌ సబ్‌ స్టేషన్‌ స్థాయిని పెంచడంపై సాధ్యాసాధ్యాలు, విద్యుత్‌ సరఫరాలో అంతరాయలు కనిష్ఠ స్థాయికి తగ్గించి నిరంతర విద్యుత్‌ సరఫరా చేయడంపై టెక్నికల్‌ టీం సంపూర్ణంగా అధ్యయనం చేసింది. కొత్త టెక్నాలజీ అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని యాజమాన్యం తెలిపింది.

కార్మిక ఖజానా ఖాళీ?

- భవన నిర్మాణ కార్మికులకు అందని ఆర్థిక సాయం
- పెండింగ్‌లో 8వేల పైచిలుకు దరఖాస్తులు
- ఏడాదిన్నరగా ఎదురుచూపులు

హన్మకొండ చౌరస్తా: తెల్లారితే అడ్డా మీద పనికోసం వెదుకులాట.. కూలీ దొరికితేనే కుటుంబం గడిచేది.. లేదంటే పస్తులే. ఇలా దినదిన గండంగా బతుకు ఈడుస్తున్న అడ్డా కూలీలకు సర్కారు నుంచి భరోసా కరువైంది. కార్మిక సంక్షేమ శాఖ నుంచి అందాల్సిన సాయం వారి దరి చేరడం లేదు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వ సాయం అందక అవస్థలు పడుతున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక కార్మికశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమ శాఖ ద్వారా నిర్మాణ రంగ కార్మికులకు పలు ప్రయోజనాలను అందజేస్తోంది. అందుకోసం భవనం, ఇతర నిర్మాణ రంగ కార్మికులు ఏటా రూ.110 చెల్లించి కార్మిక శాఖలో పేరు నమోదు చేసుకోవాలి. అనంతరం కార్మికులకు కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డు అందజేస్తారు. అప్పటి నుంచి కార్మిక సంక్షేమ శాఖ ద్వారా ప్రయోజనాలు వర్తిస్తాయి.

పెండింగ్‌లో 8 వేల దరఖాస్తులు..

వివిధ కేటగిరీల్లో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా కార్మిక కుటుంబాలకు నిరాశే మిగిలింది. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా 8వేల పైచిలుకు నిర్మాణ రంగ కార్మిక కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాయి.



కార్మికులకు అందించే సంక్షేమ ఫలాలు..

- కార్మిక సంక్షేమ శాఖ ద్వారా గుర్తింపు కార్డు కలిగిన నిర్మాణ రంగ కార్మికులకు వివిధ కేటగిరీల్లో లబ్ధి చేకూర్చుతుంది.
- భవన నిర్మాణ కార్మికుడి కూతురు వివాహానికి రూ. 30వేలు సాయం.
- కార్మికుడి భార్య లేదా కార్మికురాలు ప్రసూతి సాయానికి రూ.30 వేలు.
- నిర్మాణ కార్మికుడు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.30 వేలు.
- నిర్మాణ కార్మికుడు సహజ మరణం పొందితే రూ.లక్ష.
- ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రోజుకు రూ.300 చొప్పున రూ.4,500 వరకు చెల్లింపు.
- నిర్మాణ రంగ నైపుణ్యత శిక్షణకు రోజుకు రూ.300 ఇస్తారు.
- పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందితే రూ.4 నుంచి రూ.5లక్షలు
- ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 6లక్షల సాయం ఇస్తారు.

ప్రతిపాదనలు పంపించాం..



వివిధ కేటగిరీల్లో ఆర్థికసాయం కోసం కార్మికుల నుంచి అందుకున్న దరఖాస్తులను ప్రతి నెలా కార్మిక సంక్షేమ బోర్డుకు అందజేస్తున్నాం. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలు, కావాల్సిన మొత్తానికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే కార్మికులకు అందజేస్తాం.

– రమేశ్‌బాబు, డిప్యూటీ కమిషనర్‌ ఆఫ్‌ లేబర్‌, వరంగల్‌

ఏడాదిన్నరగా ఎదురుచూపులు



ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ కార్మికులు సుమారు 60వేల పైచిలుకు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గడిచిన ఏడాది నుంచి జిల్లా వ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దినసరి కూలీలకు రావాల్సిన సంక్షేమ నిధిని తక్షణమే విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబాలకు అండగా ఉండాలి.

– తాటి సత్యనారాయణ, శ్రమశక్తి అవార్డు గ్రహీత

లైంగిక వేధింపు కేసులో నేరస్తుడికి రెండేళ్ల జైలు



వరంగల్‌ లీగల్‌ : ప్రేమిస్తున్న.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇంటి నుంచి బాలికను తీసుకెళ్లిన ఘటనలో నేరం రుజువుకావడంతో ధర్మసాగర్‌ మండలం సాయిపేట గ్రామానికి చెందిన నేరస్తుడు సింగారపు దిలీప్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. ధర్మసాగర్‌ మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక నగరంలోని ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. వారి సమీప బంధువైన సింగారపు దిలీప్‌ సదరు బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని పలుమార్లు వేధింపులకు గురి చేశాడు. తాను నిరాకరించడంతో నువ్వు ఒప్పుకోకపోతే చనిపోతానని బెదిరించాడు. ఈ క్రమంలో 2018, ఏప్రిల్‌ 29న (ఆదివారం) దిలీప్‌ ఫోన్‌ చేసి 'మనం పెళ్లి చేసుకుందాం నువ్వు రా' అని చెప్పాడు. లేదంటే చనిపోతానని బెదిరించడంతో సదరు బాలిక చర్చికి వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మరుసటి రోజు బాలిక తండ్రి ధర్మసాగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాలిక.. దిలీప్‌ చెప్పిన విధంగా సిద్దిపేట మీదుగా హైదరాబాద్‌ చేరుకుని అక్కడి నుంచి పెళ్లి చేసుకునే నిమిత్తం తిరుపతి వెళ్లారు. తాను మేజర్‌ కానందున పురోహితులు వివాహం చేయడానికి నిరాకరించారు. మేజర్‌ కావడానికి ఆరు రోజుల వ్యవధి ఉండడంతో ఇరువురు అక్కడే మే 6వ తేదీ వరకు ఉన్నారు. ఈ క్రమంలో ధర్మసాగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిన దిలీప్‌.. బాలికను తన ఇంటికి పంపించాడు. దీనిపై విచారణ చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో దిలీప్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. కేసు విచారణలో భరోసా సెంటర్‌ న్యాయసలహాదారు నీరజ, కానిస్టేబుల్‌ అశోక్‌ సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి

- ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి

హన్మకొండ: బ్రేక్‌ డౌన్‌లు, ట్రిప్పింగ్‌లు జరిగినప్పుడు ప్రతీ చోట ప్రత్యామ్నాయ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌ రెడ్డి ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయం నుంచి నోడల్‌ ఆఫీసర్లు, సర్కిల్‌ సూపరింటెండెంట్‌ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేని చోట కొత్త లైన్లు నిర్మించి అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కనిష్ఠ స్థాయికి బ్రేక్‌ డౌన్‌లు, ట్రిప్పింగ్‌లు తగ్గించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. పొడవాటి లైన్‌లు, ట్యాపింగ్‌ లైన్‌లు ఉన్న చోట ఫాల్ట్‌ ప్యాసెజ్‌ ఇండికేటర్లు (ఎఫ్‌పీఐ) బిగించాలన్నారు. తద్వారా అంతరాయాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు వైఫల్యం చెందిన వెంటనే మార్చాలన్నారు. అలాగే, రోలింగ్‌ స్టాక్‌ పెంచుకోవాలన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ సరఫరా అందించడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌ కుమార్‌, టి.సదర్‌ లాల్‌, వి.మోహన్‌ రావు, సీజీఎంలు కె.తిరుమల రావు, టి.మధుసూదన్‌, రాజు చౌహాన్‌, కె.కిషన్‌, కెఎస్‌ గుట్ట, జీఎంలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ

చేద బావిలో పడి వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: చేద బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహేష్‌ రాజమొగిలి(40) వ్యవసాయ కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా, బంధువు చనిపోతే పరామర్శించడానికి ఆదివారం వేరే గ్రామానికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. రాత్రి సుమారు 11గంటల సమయంలో ఆవరణలోని చేద బావి దగ్గరికి వెళ్లి నీరు తోడుతున్నాడు. ఈ క్రమంలో కాలు జారి బావిలో పడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కస్తూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

దాహం తీర్చుకోవడానికి వెళ్లి మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి
- వడ్డెకొత్తపల్లిలో ఘటన



రాజు (ఫైల్‌)

పెద్దవంగర: గొర్రెలు మోపుతున్న క్రమంలో దాహం వేయడంతో తీర్చుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు మృత్యుఒడికి చేరుకున్నాడు. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లిలో జరిగింది. ఎస్సై మహేశ్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మనబోయిన రాజు (26) వ్యవసాయం, గొర్రెలకాపరిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే గొర్రెలు మోపేందుకు సోమవారం మధ్యాహ్నం తన పొలం వద్దకు వెళ్లాడు. ఎండ తీవ్రంగా ఉండడంతో దాహం తీర్చుకునేందుకు వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. అక్కడ నీరు తాగే క్రమంలో బోరు ఇనుప పైపుకు విద్యుత్‌ తీగలు తగిలి ఉండడం గమనించలేదు. దీంతో విద్యుత్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని రాజును పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రవళి, 11 నెలల కుమారుడు రియాన్స్‌ ఉన్నాడు. భార్య రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ. 10 లక్షల ఆస్తి నష్టం

మరిపెడ: షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం మరిపెడ మండలం కోట్యతండా శివారు జాలు తండాలో చోటు చేసుకుంది. బాధితుడు మాలోత్‌ గణేశ్‌ కథనం ప్రకారం.. వ్యవసాయ పనుల నిమిత్తం గణేశ్‌ తన భార్య తేలతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో షార్ట్‌ సర్క్యూట్‌ జరిగి మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్‌ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వాహనం వచ్చే లోగానే ఇల్లు పూర్తిగా కాలింది. ఈ ఘటనలో రూ. 2.75 లక్షలు నగదు, రెండు తులాల బంగారం, 70 తులాల వెండి, నాలుగు బస్తాల బియ్యంతో పాటు 65 మిర్చి విత్తనాల ప్యాకెట్లు కూడా కాలిబూడిదయ్యాయి. రెండు డబుల్‌కాట్‌ మంచాలు, కూలర్‌, ఫ్రిడ్జ్‌, దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌ కాలిపోయాయని మొత్తం రూ. 10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రోదిస్తూ తెలిపాడు.



రోదిస్తున్న బాధిత కుటుంబం

ఆర్టిజన్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ రెడ్డి

హన్మకొండ: విద్యుత్‌ ఆర్టిజన్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్‌ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ రెడ్డి చెప్పారు. సోమవారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని టీఎస్‌ ఈఈయూ–327 కార్యాలయం పల్లా రవీందర్‌ రెడ్డి భవన్‌లో టీజీ ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని 17 జిల్లాలకు చెందిన ఆర్టిజన్‌ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయిని రాజేందర్‌ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్‌ ఆర్టిజన్‌ ఉద్యోగుల సమస్యలు న్యాయమైనవన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఆర్టిజన్‌ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. టీఎస్‌ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్‌ ఇనుగాల శ్రీధర్‌ మాట్లాడుతూ ఆర్టిజన్‌ ఉద్యోగుల సమస్యలు ఇప్పటికే సీఎం రేవంత్‌ రెడ్డి, విద్యుత్‌ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్‌ సంస్థల యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లానన్నారు. విద్యుత్‌ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించారన్నారు. త్వరలో సమస్యలు, పరిష్కారమార్గాలతో కూడిన నివేదిక అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పప్పు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయా యూనియన్‌లకు చెందిన 50 మంది ఆర్టిజన్‌ ఉద్యోగులు టీఎస్‌ ఈఈయూ–327లో చేరారు. టీఎస్‌ఈఈయూ–327 ఎన్పీడీసీఎల్‌ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్‌ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నీలం ఐలేశ్‌, సత్యనారాయణ రెడ్డి, నరేందర్‌ రెడ్డి, శ్రీనివాస్‌, ఎం.బుచ్చయ్య గౌడ్‌, ఓదెలు, సీహెచ్‌.సతీశ్‌, కె.రాంబాబు, సికిందర్‌ పాల్గొన్నారు.

సరస్సంతా సందడే..!

పాకాలలో బోటింగ్‌?

- ఫారెస్ట్‌ శాఖ ఆధ్వర్యంలో చర్యలు
- ప్రైవేట్‌ సంస్థల ద్వారా ఏర్పాట్లు

ఖానాపురం: పాకాల.. పక్షుల కిలకిలరావాలు.. అటవీ జంతువులు అరుపులు, సేలయేటి చప్పుళ్లు, పచ్చని ప్రకృతికి నెలవు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని ఖానాపురం మండలం అశోక్‌నగర్‌ శివారులో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం. ఈ సరస్సుకు వరంగల్‌తోపాటు ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వేసవితోపాటు సరస్సు నిండుకుండలా ఉన్న సమయంలో పర్యాటకుల సంఖ్య కొనసాగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో సరస్సులో బోటింగ్‌ చేయడానికి ఇష్టపడుతుంటారు. గతంలో పెద్ద బోట్‌, స్పీడ్‌ బోట్‌తో పాటు జెట్టిబోట్‌ (చిన్న ఫంక్షన్లు చేసుకునే విధంగా) నడిచేవి. బోటింగ్‌ ద్వారా వచ్చిన ఆదాయాన్ని పర్యాటక అభివృద్ధికి వినియోగించుకోవడానికి అవకాశం ఉండేది. కానీ నాలుగు సంవత్సరాల క్రితం పర్యాటక, అటవీశాఖల సమన్వయ లోపంతో పాకాల సరస్సులో ఉన్న బోట్లు తరలిపోయాయి. దీంతో ఇక్కడ బోటింగ్‌ కలగానే మిగిలిపోయింది. బోట్లు తరలిపోయిన తర్వాత పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది. వచ్చిన వారు కూడా బోటింగ్‌ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ తిరుగుప్రయణామవుతున్నారు.



పాకాలలో ఉత్సాహంగా బోటింగ్‌ చేస్తున్న పర్యాటకులు(ఫైల్‌)

ఫారెస్ట్‌ శాఖ ఆధ్వర్యంలో శ్రీకారం..

పాకాలలో బోటింగ్‌ ఏర్పాటుకు టూరిజం, ఫారెస్ట్‌ అధికారుల మధ్య సయోధ్య కుదరడంలేదు. అయితే పర్యాటకులు మాత్రం బోటింగ్‌ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు ప్రైవేట్‌ సంస్థ ద్వారా బోటింగ్‌ సౌకర్యం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే మూడు రోజుల క్రితం ఓ ప్రైవేట్‌ సంస్థ బాధ్యులను తీసుకొచ్చి బోటింగ్‌ సౌకర్యంపై పరిశీలన చేసినట్లు సమాచారం. బోటింగ్‌ నిర్వహణ చేపట్టే సంస్థలతో ఏకకాల ఒప్పందం లేదా వచ్చే ఆదాయంలో పంపకం చేసుకుని నిర్వహణ చేయించేలా చర్యలు చేపడుతున్నట్లు ఫారెస్ట్‌ అధికారులు తెలిపారు. ఓ ప్రైవేట్‌ సంస్థ బాధ్యులు త్వరలోనే బోటింగ్‌ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. కాగా, అటవీశాఖ ఆధ్వర్యంలో బోటింగ్‌ సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది.



పాకాలలో జెట్టి బోట్‌(ఫైల్‌)